

గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించండి
● హాస్టల్ విద్యార్థులపై చిన్నచూపు తగదు : బాలల హక్కుల కమిషన్ చైర్మన్ నాగన్నగౌడ

భూసేకరణను రద్దు చేయాలి
● రైతులను ఆవేదనకు గురి చేయడం తగదు
● కేఐఏడీబీపై రైతుసంఘం ఆగ్రహం
8



పీణ్యా పారిశ్రామిక వాడ

అన్నీ సమస్యలే..!

● దుర్భరంగా పీణ్యా పారిశ్రామికవాడ
● దేశంలోనే ప్రఖ్యాతి గాంచింది..
● రహదారులూ కరువే..
● జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలు

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయి నగరంగా పేరొందిన బెంగళూరులో దశాబ్దాలకాలంగా పరిశ్రమలకు కేరాఫ్‌గా, లక్షలాదిమంది కార్మికులు పనిచేసే పీణ్యా పారిశ్రామికవాడ పరిస్థితి పేరు గొప్ప-ఊరుదిబ్బలా తయారయ్యింది. ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు తరహాలోనే పలు అంతర్జాతీయ వేదికలను బెంగళూరులో ఏర్పాటు చేస్తారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం, పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను రూపొందిస్తుంది. ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తారు. నగరంలో ఐటీ పరిశ్రమలు ఉండే ఎలక్ట్రానిక్‌సిటీ, వైట్‌ఫీల్డ్, సర్జాపుర రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో ఏపాటి చిన్న సమస్య తలెత్తినా అంతర్జాతీయస్థాయిలో మునిగిపోతోందనేలా ప్రచారం జరుగుతుంది. మూడేళ్లక్రిందట వైట్‌ఫీల్డ్, సర్జాపుర ప్రాంతాల్లో భారీ వర్షాలకు నీరు నిలిచిపోవడం, ఇటీవల ఇరవైరోజులక్రిందట నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ఎలక్ట్రానిక్‌సిటీ ప్రాంతం ఉండడంతో గ్లోబల్‌స్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఐటీ పరిశ్రమల ప్రాంతాల్లో ఆటో కానీ క్యాబ్ కానీ తిరగాలన్నా ఇబ్బందిగా మారిన దృశ్యాలు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు అంతర్జాతీయస్థాయి వేదికగా మారి అధికారులు, ప్రభుత్వాన్ని దుమ్ము దులిపేస్తారు. కానీ దశాబ్దాలకాలంగా 10వేల ఫ్యాక్టరీలు, వేల కోట్ల రూపాయలు లావాదేవీలు అదేస్థాయిలో విదేశాలకు ఎగుమతులతోపాటు లక్షలాదిమంది కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారు.

10వేలకుపైగా పరిశ్రమలు..

దేశంలోనే ప్రముఖ ఉత్పాదనాకేంద్రంగా పీణ్యా పారిశ్రామికవాడకు పేరుంది. చిన్న వస్తువుల నుంచి విమానాలతోపాటు, అన్నిరకాల పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు తయారవుతాయి. చిన్న ఫ్యాక్టరీలు అయినా దేశ, విదేశీ కంపెనీలకు మూలాధారంగా పారిశ్రామికవాడ ఉంది. ఇక్కడి కార్మికులు ఎంతో నైపుణ్యత చెందినవారు, దశాబ్దాల అనుభవంతో వందలాది విదేశీ కంపెనీలకు అవసరమైన విడిభాగాలను తయారుచేసే కేంద్రంగా ఉంది. పీణ్యా పారిశ్రామికవాడ 40 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంది. ఇండస్ట్రియల్ ఎస్టేట్ 4 విడతలలో విస్తరణ చెందింది. ఏడాది పొడవునా ఇక్కడి పరిశ్రమలు పనిచేస్తుంటాయి. సుమారు 10వేలకుపైగా పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఇంకా పలు పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటుకు సుముఖత చూపుతున్నా నగరం నుంచి దూరంగా పరిశ్రమలకు అనుమతులు ఇప్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

అధ్వానంగా రహదారులు..

దశాబ్దాలకాలం కిందటే నగరానికి అనుబంధంగా పీణ్యా పారిశ్రామిక వాడ ఏర్పాటైంది. బెంగళూరు-తుమకూరు జాతీయ రహదారికి అనుబంధంగా పారిశ్రామికవాడ ఉంది. ప్రధానంగా ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్ విభాగాలకు అనుబంధమైన పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో సీఎన్‌సీ మిషన్‌టూల్స్, డైక్యాస్టింగ్, ఫ్యాబ్రికేటర్స్, హెచ్‌పీడీసీ, ట్రాన్స్‌ఫార్మర్స్, మోటర్‌లు, జనరేటర్‌లు, హైడ్రాలిక్, టెక్స్‌టైల్ మిషనరీ, రబ్బర్‌మౌల్డింగ్ విభాగాలు అత్యధికంగా ఉన్నాయి. దశాబ్దాల క్రితమే పారిశ్రామివాడ ఏర్పడింది. నాలుగు విడతల్లో పారిశ్రామికవాడను అభివృద్ధి చేశారు. ప్రధాన రహదార్లు మినహా అన్ని ప్రాంతాలకు సంపూర్ణంగా రోడ్లు, కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వర్షపునీరు నిల్వ చేసే విభాగాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.



పీణ్యా దాసరహళ్ళి ప్రాంతంలో గుంతలమయమైన రోడ్డు

కార్మికులకు తప్పని ఇబ్బందులు

పరిశ్రమ అంటేనే ముడిసరుకు రవాణా, వ్యర్థాలతోపాటు ఉత్పత్తి వస్తువులు బయటకు పంపాల్సి ఉంటుంది. ఇలా ప్రతి పరిశ్రమకు ప్రతిరోజూ వాహనాలు అవసరంగా ఉంటాయి. ఏమాత్రం వర్షం కురిసినా కొన్ని ఫ్యాక్టరీలవైపు వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడ చూసినా పరిశ్రమల వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోతోంది. విధులకు వచ్చే కార్మికులు పలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పారిశ్రామివాడకు నిత్యం వేలాది ట్రక్కులు లారీలు, టెంపోలు, మినీ టెంపోల ద్వారా ముడిసరుకు రవాణా చేస్తారు. పరిశ్రమలో సిద్ధమైన వస్తువులను సంపూర్ణమైన ప్యాకింగ్‌తో కంటైనర్‌లు, ట్రక్‌లు, భారీ వాహనాలలో తరలిస్తుంటారు. ఇక్కడ భారీ వాహనాలు సులభతరంగా ప్రయాణించే పరిస్థితి లేకుండాపోయింది. కర్ణాటక ఇండస్ట్రియల్ డెవలెప్‌మెంట్ బోర్డ్ ప్లాట్‌లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు కేటాయించింది. కానీ సంపూర్ణంగా మౌలిక సదుపాయాలను సమకూర్చడంలో విఫలమైంది. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధికి కర్ణాటక స్టేట్ స్మాల్ ఇండస్ట్రియల్ డెవలెప్‌మెంట్ కార్పొరేషన్ సహా సౌలభ్యాలు కల్పించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. కనీస మౌలిక సదుపాయాలు లేక ముడి వస్తువుల రవాణ, ఉత్పత్తి వస్తువుల పంపిణీకి ఇబ్బంది పడే పరిస్థితి కొనసాగుతోంది.

ఎస్‌టీపీ స్థాపనకు డిమాండ్

పారిశ్రామికవాడల్లో వ్యర్థాలను సంస్కరించేందుకు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) తప్పనిసరి చేశారు. అయితే పీణ్యాలో కొన్ని పరిశ్రమలు ఎస్‌టీపీలను ఏర్పాటు చేసుకున్నాయి. అయితే అన్ని ఫ్యాక్టరీలు ఎస్‌టీపీల ఏర్పాటుకు స్థలం కొరత, అదనపుభారం ఎదుర్కొనాల్సి వస్తోంది. దీంతో కొన్ని ప్లాంట్‌లు సొంతంగా వ్యర్థాలను విభజిస్తున్నాయి. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నగరానికి దూరంగా తరలిస్తున్నారు. వాటిని రోడ్డుపక్కన, కాలువలు, చెరువుల సమీపంలో వదుల్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పీణ్యాలో కాలుష్యనియంత్రణ మండలికి అనుబంధంగా ఉండే 2 ఎకరాలలో ఎస్‌టీపీ ఏర్పాటు చేయవచ్చుననే డిమాండ్ ఉంది. పరిశ్రమలంటూనే వ్యర్థాలు కూడా ఎక్కువగా ఉంటాయి. పేపర్లు, ప్లాస్టిక్, రసాయనాలు, ఐరన్ వంటి వ్యర్థాలను సాంకేతికంగా విభజించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ నిబంధనల ప్రకారం అమలు కావడం లేదు. పాలికెలో 6 వార్డులకు అనుబంధంగా ఉండే పారిశ్రామికవాడలో చెత్త విభజన దారి తప్పింది. ఇటీవల ఘన, ద్రవ వ్యర్థాలను వేరు చేయాలని పాలికె సూచించింది. కానీ పారిశ్రామికవాడలో కొన్నిచోట్ల మాత్రమే టిప్పర్ల ద్వారా చెత్తను తొలగిస్తున్నారు. పలుచోట్ల చెత్తరాశులు యథావిధిగా ఉంటున్నాయి.

పీణ్యా పారిశ్రామికవాడ 40చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 10వేల పరిశ్రమలు, 10లక్షలమంది కార్మికులు పనిచేస్తున్నారు. 35వేల కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతాయి. 8వేల కోట్ల రూపాయల విలువైన ఎగుమతులు సాధ్యం కానున్నాయి. అన్ని తరహా పన్నులు 8వేల కోట్లదాకా చెల్లిస్తారు.



దెబ్బతిన్న రహదారి

అత్యవసరంగా చేపట్టాల్సిన పనులివీ..

పీణ్యా పారిశ్రామికవాడలో ఫుట్‌పాత్‌లు, కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు కావాల్సి ఉంది. కాలుష్యనియంత్రణకు ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటాలి. ప్రత్యేకించి ఎస్‌టీపీ విభాగాన్ని ఏర్పాటు చేయాలి. అత్యవసరంగా పారిశ్రామికవాడలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలి. పారిశ్రామికవాడలో బందోబస్తు ఏర్పాటు చేయాలి. కార్మికుల సురక్షత దృష్ట్యా రవాణా వ్యవస్థతోపాటు మహిళా కార్మికులకు బస్సు సౌలభ్యం ఏర్పాటు చేయాలి. పీణ్యా పారిశ్రామికవాడ ప్రదేశంలో మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ నిర్లక్ష్యం చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. కానీ చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ చొరవ చూపాల్సి ఉంది. పరిశ్రమల ఏర్పాటుకు కర్ణాటక సముచితమైనదని దేశవిదేశాలలో ప్రచారం చేస్తున్నారు. కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి సింగిల్ విండో విధానంతో అనుమతులు ఇస్తామని ప్రకటించారు. ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చారు. ఇవన్నీ బాగానే ఉన్నా దశాబ్దాల క్రితం ఏర్పడిన పరిశ్రమలకు కనీస సౌలభ్యాలు కల్పించే విషయంలో నిర్లక్ష్యం సరికాదని కార్మికులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలో నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.



ఇటీవల వర్షాలకు జలమయమైన రహదారి

ముగ్గురు పిల్లలతో కుంటలో దూకిన తల్లి

బళ్లారి గాంధీనగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలతో తల్లి కుంటలో దూకింది. బళ్లారి జిల్లా కురుగోడు తాలూక దమ్మూరులోని వ్యవసాయకుంటలో వీరి మృతదేహాలు బయటపడ్డాయి. మృతులను సిద్దవ్వ అలియాస్ లక్ష్మి(29), ఆమె కూతుళ్ల అభిజ్ఞ(7), అవని(5), ఆరాధ్య(3)గా పోలీసులు గుర్తించారు. మహారాష్ట్ర రాష్ట్రం కొల్హాపుర జిల్లాకు చెందిన ఈ కుటుంబం దమ్మూరు గ్రామంలో నివాసం ఉంటోంది. సిద్దవ్వ మంగళవారం కుమార్తెలతో సహా కనిపించకుండా పోయింది. ఎక్కడకు వెళ్ళిందో తెలుసుకునే లోపే బుధవారం ఉదయం దూమ్మరు గ్రామ సమీపంలోని వ్యవసాయ కుంటలో నలుగురు మృతదేహాలుగా కనిపించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యవసాయ కుంటలో ఉన్న ముగ్గురు చిన్నారులు, తల్లి మృతదేహాలను బయటకు తీశారు. సిద్దవ్వ తల్లి రేణుక భర్త వేధింపులు తాళలేకే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కురుగోడు పోలీస్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హిరేగౌడ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.



ముగ్గురు పిల్లలతో తల్లి సిద్దవ్వ (ఫైల్)



మృతదేహాల వద్ద పోలీసులు

నంది కొండల్లో కేబినెట్ భేటీ రద్దు

నేడు విధానసౌధలోనే..

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర పరిధిలోని నంది కొండలలో జరగాల్సిన కేబినెట్ భేటీ రద్దు చేశారు. గురువారం విధాన సౌధలో మంత్రివర్గ సమావేశం ఉంటుందని కేబినెట్ సెక్రటరీ ప్రకటన జారీ చేశారు. మంగళవారం దాకా నందికొండలపై అతిథిగృహంలో కేబినెట్ భేటీ ఉంటుందని స్థానిక అధికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రులతోపాటు ఉన్నతాధికారులు హాజరవుతారని, అందుకు తగిన సౌలభ్యాలను సిద్ధం చేశారు. బుధవారం ఉదయం ఒక్కసారిగా కేబినెట్ భేటీని మార్చారు. చిక్కబళ్లాపురలో కేబినెట్ సమావేశం నిర్వహించడం ద్వారా కోలారు, చిక్కబళ్లాపుర, తుమకూరు జిల్లాల సమస్యలు చర్చకు వస్తాయని ప్రజలతోపాటు ఎమ్మెల్యేలు భావించారు. అయితే మూడు జిల్లాల్లోనే అత్యధికంగా సాగు చేసే పంటకు గిట్టుబాటుధర లభించకపోవడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. రాష్ట్రంలో విక్రయించేందుకు తగిన ధర లేకపోవడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని ఫ్యాక్టరీలు మామిడిని ఈసారి నిషేధించడంతో రైతులు నష్టపోయారు. వారం రోజులుగా కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల్లో మామిడి రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇదే తరుణంలో జేడీఎస్ పార్టీ చిక్కబళ్లాపురలో ఆందోళనకు పిలుపునిచ్చారు. శ్రీనివాసపుర ఎమ్మెల్యే వెంకట శివారెడ్డి విధానసౌధ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మామిడి రైతుల కోసం ధర్నా చేశారు. గురువారం నందికొండలపై కేబినెట్ భేటీ జరిగే చోట నిరసన కొనసాగించాలని భావించారు. వివాదం అవుతుందనే ఉన్నఫళంగా విధానసౌధకు కేబినెట్ భేటీ మార్చినట్లు సమాచారం.



తొలి సేంద్రియ సాగు తాలూకా జోయిడా

● ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ● సాగు పనులను ప్రారంభించిన మంత్రి చలువరాయస్వామి

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సమాజంలో రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు లేకుండా పంటలు పండించడం అరుదైపోతోంది. దేశంలో సేంద్రియసాగు తాలూకాగా ఉత్తరకన్నడ జిల్లా జోయిడాను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. తాలూకాలోని అన్ని గ్రామాల్లోనూ సంపూర్ణంగా సేంద్రియపద్ధతిలో సాగు చేయనున్నారు. మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, స్థానిక ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే లాంఛనంగా ప్రారంభించారు. జోయిడాలో పంటలసాగుతోపాటు దాదాపు 60 శాతానికి పైగా అటవీప్రాంతం ఉంది. ఇక్కడ లభించే తేనెతోపాటు పలు రకాల ఉత్పత్తులు అంతర్జాతీయంగానే పేరొందినట్లు మంత్రి చలువరాయస్వామి తెలిపారు. రానున్న మూడేళ్లలో సంపూర్ణంగా సేంద్రియసాగు తాలూకాగా మారుస్తామన్నారు. ఇక్కడి ఉత్పత్తులకు మార్కెటింగ్‌కు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే మాట్లాడుతూ జోయిడా తాలూకాను సేంద్రియప్రాంతంగా గుర్తించేందుకు సుమారు పదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తాలూకాలో 1.91 లక్షల హెక్టార్ల భూమిలో 1.65 లక్షల హెక్టార్ల అటవీప్రాంతం ఉంది. ఇక్కడి ప్రజలు రసాయనాలు వాడకుండానే వరితోపాటు ఇతరపంటలు సాగు చేస్తున్నారన్నారు.



విత్తన పనులను ప్రారంభిస్తున్న మంత్రి చలువరాయస్వామి

చెట్టుకొమ్మ పడి.. యువకుడు బ్రెయిన్‌డెడ్


బెంగళూరు, జూన్18(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చెట్టుకొమ్మ పడి తీవ్రంగా గాయపడిన యువకుడు అక్షయ్ బ్రెయిన్‌డెడ్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారు. ఈనెల 15న బసవనగుడి బ్రహ్మచైతన్యమందిరం వద్ద చెట్టుకొమ్మ పడి అక్షయ్ (29) తీవ్రంగా గాయపడ్డాడు. శస్త్రచికిత్స నిర్వహించిన 60 గంటల తర్వాత కూడా మెదడు స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా పరిగణించినట్లు వైద్యులు బుధవారం మీడియాకు తెలిపారు. సాధారణంగా 48 గంటల వరకు స్పందించకపోతే బ్రెయిన్‌డెడ్‌గా పరిగణిస్తారనీ, 60 గంటలు గడిచినా స్పందన లేదని వైద్యులు తెలిపారు.



అక్షయ్ (ఫైల్)



కమలాపురం కొండలో నుంచి పారుతున్న నీరు



హొయలు పోతున్న బుక్కసాగర జలపాతం

ఆకట్టుకుంటున్న జలపాతాలు

కంప్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడవుల్లో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. జలపాతాలు గలగలలాడుతున్నాయి. జలపాతాలు చూసేందుకు పర్యాటకులు విశేషంగా తరలివస్తున్నారు. హంపి పుణ్యక్షేత్రం ప్రాంతాల్లోని జలపాతం వుండటంతో పర్యాటకులకు ఎక్కువగా ఆకట్టుకుంటుంది. కమలాపురం బుక్కసాగర మధ్య మార్గంలో ఎత్తైన కొండల్లో జలకళ కొట్టుమిట్టాడుతోంది. ఏటా ఆగస్టులో ఈ జలపాతాలు కనిపించేవి కానీ ఈ ఏడు ముందుగానే వర్షాలు రావడంతో జూన్ నెలలోనే జలపాతాలు కళకళలాడుతున్నాయి. గ్రామప్రజలు, యువకులు అక్కడకు చేరుకుని స్నానాలు చేస్తూ సేద తీరుతున్నారు. అక్కడక్కడా ఎండలు మండిపోతుండంతో పర్యాటకులు విరివిగా విచ్చేస్తూ జలపాతాల్లో స్నానాలు చేస్తున్నారు. హంపికి వచ్చే పర్యాటకులు జలపాతాల వద్దకు వచ్చి మరీ ఫొటోలు దిగుతున్నారు. ముందస్తు వర్షాలతో ఎన్నడూ లేనిదీ జలపాతాలు కళకళలాడుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యడియూరప్ప పెద్దన్నలాంటివారు

● ఇద్దరమూ కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేశాం: మాజీ డీసీఎం ఈశ్వరప్ప

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): యడియూరప్పతో తనది అన్నదమ్ముల సంబంధం అని... మాజీ డీసీఎం కేఎస్ ఈశ్వరప్ప పేర్కొన్నారు. బుధవారం శివమొగ్గలో హిందూజాతిభక్తుల సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈశ్వరప్ప మాట్లాడుతూ తాను, యడియూరప్ప, శంకరమూర్తి, ఆనందరాయలు బీజేపీ కోసం దశాబ్దాలపాటు పనిచేశామన్నారు. తనకు యడియూరప్ప పెద్దన్నలాంటివారన్నారు. ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా యడియూరప్ప ఫోన్ చేసి పరామర్శించారన్నారు. తన జన్మదినం రోజున శుభాకాంక్షలు తెలిపారన్నారు. యడియూరప్ప మనవడి పెళ్లికి ఆహ్వానించడంతో వెళ్లానన్నారు. అందులో ప్రత్యేక చర్చలు ఏమీ జరగలేదన్నారు. రాజకీయం వేరు, స్నేహం వేరన్నారు.



మాట్లాడుతున్న మాజీ డీసీఎం ఈశ్వరప్ప

నేటి నుంచి టీ20 క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. జిల్లా సీనియర్ టీ20 జట్టుకు వినయ్‌కుమార్, గిరినాథ్‌రెడ్డి, అర్జున్‌టెండూల్కర్, దత్తారెడ్డి, రాజు కుళ్ళాయప్ప, మహేంద్రరెడ్డి, సంపత్‌కుమార్, సంతోష్, రోహిత్‌రోషన్, మల్లికార్జున, మహ్మద్‌కమిల్, దీపక్, మహబూబ్‌పీరా, ప్రదీప్‌రెడ్డి, వీరారెడ్డి, చైత్రవర్ధన్‌లు ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా ప్రమోద్, ప్రశాంత్, భానుప్రకాష్, లోహిత్‌సాయి కిశోర్, వికాస్‌లు నిలిచారు. టీ20 టోర్నీలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఐదు జట్లు పాల్గొంటాయన్నారు. గురువారం కడప-కర్నూలు, అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కదిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండా వీధిలో నివాసముంటున్న షేక్ జిలానీ (39) విద్యుదాఘాతంతో బుధవారం మృతిచెందాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిలానీ బేల్దారి పని చేస్తుండేవాడు. బుధవారం మధ్యాహ్నం చౌక్ జంక్షన్ వద్ద కాలువ కనిపించకుండా ఇనుక కడ్డీలు అమర్చి, బండలు వేసే సమయంలో ప్రమాదవశాత్తు డ్రిల్లింగ్ మిషన్‌కు అమర్చిన వైరు తగిలి జిలానీ షాక్‌కు లోనయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. దీనిపై జిలానీ భార్య ఫర్హానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ వివరించారు.

గోరంట్లలో రైతు...

హిందూపురం(గోరంట్ల), జూన్ 18(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలంలోని కొత్తపల్లికి చెందిన రైతు నరేష్(40) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎప్పటిలాగే బుధవారం పొలం వద్దకు మోటారు ఆన్ చేయడానికి వెళ్లాడు. అయితే స్టార్టర్‌ను ముట్టుకోగానే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ వ్యవసాయం చేస్తూ టీడీపీలో చురుగ్గా ఉండేవాడు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జూన్18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫాం వద్ద రైలు కింద పడి నంద్యాల జిల్లాకు చెందిన విశ్వేశ్వరరెడ్డి (29) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం యర్రగుడి గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి కుమారుడు విశ్వేశ్వరరెడ్డి కొంతకాలంగా వ్యసనాలకు బానిసయ్యాడు. క్రికెట్ బెట్టింగులు, ఆన్‌లైన్ జూదం ఆడి అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చే మార్గంకానరాక మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే తాడిపత్రికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగం రాలేదని..

బుక్కరాయసముద్రం, జూన్18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని శివరాజ్ (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుక్కరాయసముద్రంలో జరిగింది. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన సంగమేశ్ కూలి పని చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతడి కుమారుడు శివరాజ్ (21) డిగ్రీ పూర్తి చేశాడు. రెండేళ్ల నుంచి పలుచోట్ల ఉద్యోగాల కోసం ప్రయత్నించినా ఎక్కడా ఉపాధి అవకాశాలు రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

హిందూపురం/కళ్యాణదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దొడ్డబళ్లాపురం సమీపంలో రైలు ఢీకొని సురేంద్రనాయుడు(36) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడిది కంబదూరు మండలం డీ చెన్నేపల్లి గ్రామం కాగా గత పదేళ్ల నుంచి హిందూపురం త్యాగరాజ్‌నగర్‌లో నివాసముంటున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ దాటే సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొన్నట్లు తెలిపారు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనం నుంచి పడి వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

బత్తలపల్లి, జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపెట్ల గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం నుంచి జారిపడి రమేష్ (39) మృతిచెందాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంపెట్ల గ్రామానికి చెందిన వెంకటస్వామి కుమారుడు రమేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. రమేష్‌ను అతడి అన్న వెంకటనారాయణ ద్విచక్రవాహనంలో కూర్చోబెట్టుకుని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి బయల్దేరాడు. గ్రామ శివారులో వెనుక కూర్చున్న రమేష్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తమ్ముడు వెంకటగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన నాయకుల రాజీనామా


రాజీనామా పత్రాలను అందజేస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజాసమాఖ్య (జీపీఎస్), గిరిజన విద్యార్థి సమాఖ్య (జీవీఎస్)ల ఉమ్మడి జిల్లా నాయకులు మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, జాతీయ సలహాదారులు నారాయణస్వామి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్, రాయలసీమ యువజన అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, హిందూపురం పార్లమెంట్ జీవీఎస్ అధ్యక్షుడు శీనానాయక్, అనంతపురం అధ్యక్షుడు రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులు శివానాయక్, బాబు నాయక్, మహిళావిభాగం అధ్యక్షురాలు శోభాబాయి, కార్యదర్శి సుమతి తమ రాజీనామా పత్రాలను జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్‌కు పంపినట్లు తెలిపారు. గత 20ఏళ్లుగా గిరిజనుల కోసం పనిచేశామని, అయితే స్వార్థ పరులైన నాయకుల వ్యవహారశైలి నచ్చకనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పూర్తి కమిటీలు రద్దు చేసినట్లు తెలిపారు. తమ నాయకుడు ఒక పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారన్న అసంతృప్తితో రాజీనామా చేశామన్నారు.

సమగ్రశిక్షలోనూ బదిలీలు

అనంతపురం విద్య, జూన్18(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలోనూ బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వెల్లడించారు. జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, మండలస్థాయిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ, పీటీ, సీఆర్‌ఎంటీలు, అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, సైట్ ఇంజినీర్లకు బదిలీలు నిర్వహిస్తామన్నారు. రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారు ఈనెల 21వతేదీలోగా దరఖాస్తును జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. అభ్యర్థుల స్టేషన్ సీనియారిటీ, స్పెషల్ సర్వీస్ సీనియారిటీ పాయింట్లను ఈఏడాది ఏప్రిల్ 30 వరకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లాలనుకునేవారు దరఖాస్తులను రాష్ట్ర కార్యాలయానికి పంపించాల్సి ఉంటుందని ఏపీసీ వివరించారు.

గిరిజన సంక్షేమ డీడీగా శ్రీనివాసరావు

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడి(డీడీ)గా శ్రీనివాసరావు నియమితుడయ్యారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న రామాంజనేయులును మాతృశాఖ పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసరావును అనంతకు ప్రభుత్వం నియమించింది.

ఏం పనులు చేశారో చెప్పండి..?

అధికారులను ప్రశ్నించిన కేంద్ర బృందం

ఉపాధి నిధులతో చేసిన పనులపై ఆరా


సోదనపల్లిలో లోతు దుక్కిని పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి నిధులతో ఏఏ పనులు చేశారో చెప్పాలని డ్వామా, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ బృందం సభ్యులు నవనీతదాస్, వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు బుధవారం స్థానిక డ్వామా సమావేశపు హాల్‌లో డ్వామా, వ్యవసాయ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఐసీడీఎస్, మత్స్యశాఖ, భూగర్భజల శాఖ, అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సలీం బాషా జిల్లాలో ఉపాధి హామీ నిధులతో ఆయా శాఖల్లో చేపట్టిన పనులను కమిటీ సభ్యులకు వివరించారు. గురువారం నుంచి ఈనెల 21వతేదీ దాకా బృందం సభ్యులు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పర్యటించి, ఉపాధి నిధులతో చేపట్టిన పనులను పరిశీలిస్తారన్నారు. యల్లనూరు మండలం చింతకాయమంద, మల్లాగుండ్ల గ్రామ పంచాయతీలు, అనంతపురం రూరల్, కందుకూరు పంచాయతీల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయాప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు, వాటి ప్రయోజనాలపై స్థానిక లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి నిల్వ పనులపై సంతృప్తి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాటర్ షెడ్ ద్వారా నీటిని నిల్వ చేసేందుకు చేపట్టిన పనులను జలశక్తి కేంద్ర బృందం సభ్యులు శంకర్, గౌతమ్ బుధవారం పరిశీలించారు. ఆయా పనుల కోసం ఖర్చు చేసిన నిధులపై ఆరా తీశారు. డ్వామా వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి బృందం సభ్యులకు వాటర్ షెడ్ ద్వారా నీటి నిల్వ చేసేందుకు చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను వివరించారు. నీటి నిల్వ కోసం చేపట్టిన పనులపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యకలాపాలను పరిశీలించారు. ఆ తర్వాత తాడిపత్రిలో మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని పరిశీలించి, వాటి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం తాడిపత్రిలోని ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాంపాండ్స్‌ను పరిశీలించారు. సాయంత్రం గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫారంపాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని పరిశీలించారు.

రెండోరోజు పర్యటన వివరాలిలా..

జలశక్తి కేంద్ర బృందం సభ్యులు గురువారం రెండోరోజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను పరిశీలిస్తారు.

జీవిత ఖైదీలకు స్వేచ్ఛ

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి విడుదల


అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు నుంచి విడుదల అవుతున్న నలుగురు ఖైదీలతో జైలు అధికారులు


పెనుకొండ సబ్ జైలు నుంచి విడుదలైన సురేష్ బాబు

బుక్కరాయసముద్రం/పెనుకొండ టౌన్, జూన్ 17(ఆన్‌లైన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలో ఐదుగురు జీవిత ఖైదీలు జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలు నుంచి నలుగురు, పెనుకొండ సబ్ జైలు నుంచి ఒకరు క్షమాభిక్షపై బయటకు వచ్చారు. వీరిలో నలుగురు హత్య కేసులో, ఒకరు వరకట్నం కేసులో శిక్ష అనుభవించారు. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు నుంచి విడుదల అయినవారిలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలానికి చెందిన మద్దిరాల రాంబాబు(50), వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన దొంతిరెడ్డి పాల్ రెడ్డి (54), కడప అర్బన్‌ను చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్ (51), పొట్టి శ్రీరాములు నెలూరు జిల్లా కేంద్రానికి చెందిన బండల చంద్ర (41) ఉన్నారని జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫివుర్ రెహమాన్ తెలిపారు. పెనుకొండ సబ్ జైలు నుంచి జీవిత ఖైదు అనుభవిస్తున్న సురేష్ బాబు విడుదలయ్యారు. చెన్నైకి చెందిన సురేష్ బాబు వివాహం అనంతరం తిరుపతిలో ఉండేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య మృతిచెందడంతో నమోదైన వరకట్నం కేసులో 17 ఏళ్లపాటు శిక్ష అనుభవించారు. ఇంటర్ చదువుతున్న తన కుమారుడు, కూతురు భవిష్యత్తు కోసం ఇక ఏదో ఒక పని కష్టపడి చేసుకుంటానని సురేష్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా..?

సచివాలయ సిబ్బంది బదిలీలపై సందిగ్ధత

ఎంపీడీఓల లాగిన్ నుంచి అప్‌లోడ్ కాని దరఖాస్తులు

కొరవడిన స్పష్టత

కార్యాలయాల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సచివాలయాల సిబ్బంది బదిలీలపై సందిగ్ధం నెలకొంది. ఆఫ్‌లైన్ నిర్వహిస్తారా..? ఆన్‌లైన్‌లో చేస్తారా అన్నదానిపై స్పష్టత కరువైంది. దీంతో సిబ్బంది అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా సర్వర్ పనిచేయట్లేదు. ఈనెల 16 నుంచి 18వతేదీ వరకు వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. 22 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో బదిలీల అభ్యర్థనకు అవకాశం కల్పించారు. 25నుంచి 29వ తేదీ వరకు వాటిని పరిశీలించనున్నారు. 30న కలెక్టర్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఉత్తర్వులు వచ్చాయి. వివరాల నమోదుకు సర్వర్ ఓపెన్ కాకపోవడంతో ఉద్యోగులు అయోమయంలో పడ్డారు. సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కొన్ని విభాగాల్లో సంబంధిత అధికారులను సంప్రదించి బెర్త్ ఖరారు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రిక్వెస్ట్ బదిలీలు మాత్రమే ఆన్‌లైన్‌లో చేస్తారనీ, ఐదేళ్లు పూర్తయిన వారికి ఆఫ్‌లైన్ ద్వారానే చేసే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

వైద్యశాఖలో బదిలీల సందడి

కొనసాగుతున్న కౌన్సెలింగ్


ఏఎన్‌ఎంల బదిలీలు చేపడుతున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో బదిలీల సందడి నెలకొంది. వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, జిల్లా వైద్యాధికారి కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంల నుంచి ప్రొఫెసర్ల వరకు స్థానచలనం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 161 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారని అధికారులు తెలిపారు. 25 కేడర్లలో 500 మంది వరకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన లిస్టులో ఉన్నారు. మరో వందమంది వరకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారు. జూమ్ మీటింగ్ ద్వారా ఉద్యోగులు హాజరై, ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. బదిలీల ప్రక్రియ శనివారం వరకు కొనసాగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. బదిలీ అయిన వారికి ఈనెల 23లోపు ఉత్తర్వులు జారీ చేస్తారని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

లైబ్రేరియన్ పోస్టు ఖాళీ

వైద్య కళాశాలలోని కేంద్ర గ్రంథాలయ లైబ్రేరియన్ పోస్టు ఖాళీ పడనుంది. అక్కడ పనిచేస్తున్న రామేశ్వరి.. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోవడంతో కర్నూలుకు బదిలీ అవకాశం కల్పించారు. లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్‌తోపాటు నలుగురు సహాయక ఉద్యోగులు సెంట్రల్ లైబ్రరీలో పనిచేస్తున్నారు. లైబ్రేరియన్ మినహా అందరూ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. రామేశ్వరి బదిలీతో సెంట్రల్ లైబ్రరీలో రెగ్యులర్ ఉద్యోగులు ఉండరని కళాశాల అధికారులు పేర్కొన్నారు.

కేడర్ల వారీగా బదిలీలు ఇలా..

కేడర్	బదిలీ అయినవారి సంఖ్య
ప్రొఫెసర్లు	2
అసోసియేట్ ప్రొఫెసర్లు	6
ల్యాబ్ టెక్నీషియన్లు	12
జూనియర్ అసిస్టెంట్లు	7
ఎల్‌డీ, కంప్యూటర్స్	8
టైపిస్టులు	4
ఏఎన్‌ఎం	122
మొత్తం	161

కొందరు లక్కీ..

నిబంధనలకు మేరకు కాలపరిమితి పూర్తయినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని రాష్ట్ర వైద్య శాఖ ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు వివరాలు క్రోడీకరించి ఉద్యోగులను అధికారులు బదిలీ చేస్తున్నారు. మెడికల్ గ్రౌండ్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్, స్పౌజ్ తదితర వెసులుబాటు ఉన్న వారిని ప్రస్తుత స్థానంలో కొనసాగిస్తున్నారు. బదిలీ అవ్వాల్సిన కొంతమంది ఉద్యోగులకు అదృష్టం వరించినట్లుంది. ప్రస్తుత స్థానం నుంచి బదిలీ కావాలంటే క్లియర్ వెకేన్సీలు, పోస్టింగులు ఎక్కడా దొరకడంలేదు. దీంతో వారందరూ ప్రస్తుత స్థానంలోనే కొనసాగుతారని అధికారులు పేర్కొంటున్నారు.

అర్ధాంతరంగా బదిలీల నిలుపుదల

వైద్యశాఖ ఆర్డీ రామగిడ్డయ్య

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో చేపట్టిన బదిలీల ప్రక్రియను అర్ధాంతరంగా నిలుపుదల చేస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) రామగిడ్డయ్య బుధవారం తెలిపారు. హంస సిఫార్సులను బదిలీల్లో పరిగణనలోకి తీసుకోకూడదంటూ ఇతర సంఘాల నాయకులు.. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో హంస తాత్కాలిక గుర్తింపును నిలుపుదల చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల్లో హంస కార్యవర్గంలోని ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వలేదన్నారు. తమకు న్యాయం చేయాలని హంస కార్యవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో గుర్తింపును కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఆ మేరకు మినహాయింపునిచ్చేలా బుధవారం నిర్వహించిన అన్ని కేడర్ల బదిలీలను పునఃపరిశీలిస్తామన్నారు. గురువారం నుంచి చేపట్టే బదిలీల్లో మినహాయింపును వర్తింపజేస్తామని తెలిపారు. కోర్టు తీర్పుపై హంస నాయకులు షఫీ, వేణుగోపాల్, రాఘవేంద్రరెడ్డి, అనిల్‌నాయక్, నల్లప్ప, విజయప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు.

ఉన్నత పాఠశాలలో చోరీకి యత్నం

- సైకిళ్లు ఉంచిన గది తాళాలను పగులగొట్టిన దుండగులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైకిళ్ల చోరీకి గురుతెలియని దుండగులు యత్నించారు. ఉన్నత పాఠశాలలోకి మంగళవారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి, సైకిళ్లు ఉంచిన గది తాళాలను పగులగొట్టారు. అందులోని ఓ సైకిల్‌ను బయటకు తీసుకొచ్చి ప్రార్థనా ప్రాంగణం వద్ద పడేసి వెళ్లారు. మొత్తం 155 సైకిళ్లు ఉండగా.. ఒక్కటి కూడా ఎత్తుకెళ్లలేదు. ఎస్ఐ సత్యనారాయణ పాఠశాలను పరిశీలించి, హెచ్ఎం ఓబుళమ్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇది ఆకతాయిల పనా, దొంగలే ప్రయత్నించి ఉంటారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.


తరగతి గది గ్రిల్ తాళాలను పగులగొట్టిన దృశ్యం

హృషికేశ్‌కు ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి యశ్వంతపూర్-యోగ్ నగరి హృషికేశ్‌కు అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యశ్వంతపూర్-హృషికేశ్ (06597) ప్రత్యేక రైలు ఈ నెల 19న (గురువారం) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి 21 ఉదయం 10-20 గంటలకు హృరిషికేశ్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు ప్రత్యేక రైలు (06598) హృషికేశ్‌లో 21 సాయంత్రం 5-55 గంటలకు బయలుదేరి 23 సాయత్రం 7-45 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూల్ సిటీ, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, భోపాల్, బీనా, వీరాంగన లక్ష్మీబాయ్ ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా కంటోన్మెంటు, మథుర, హజ్రత్ నిజాముద్దీన్, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫ్ఫర్‌నగర్, తాప్రి, రూర్కీ, హరిద్వార్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

జడ్పీ సీఈఓ శివశంకర్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓగా శివశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఈఓగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని సరండర్ చేశారు. దీంతో డ్వామాలో ధర్మవరం ఏపీడీగా పనిచేస్తున్న శివశంకర్‌ను జడ్పీ సీఈఓగా నియమించారు. ఆయన జడ్పీ కార్యాలయంలోని సీఈఓ చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రమే కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను కలిశారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

27 నుంచి గూగూడు బ్రహ్మోత్సవాలు

నార్పల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఈఓ శోభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న స్వామి వారి ప్రథమ దర్శనం, 28న స్వామి వారి నిత్యపూజ నివేదన, 29న స్వామి వారి అగ్నిగుండము ఏర్పాటు చేయుట, స్వామి వారిని నిలుపుట, ఏప్రిల్ 1న స్వామి వారి నిత్యపూజ నివేదన, 2న స్వామి వారి చిన్నసరిగెత్తు, 3న స్వామి నిత్యపూజ నివేదన, 4న స్వామి వారి ఏడో చిన్నసరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 5న నిత్యపూజ నివేదన విడిదినము, 6న స్వామి వారి గ్రామోత్సవం, పెద్దసరిగెత్తు రాత్రికి దేవుడి మెరవణి, అగ్నిగుండం ప్రవేశం, 7న అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమం, 9న స్వామి వారి చివరి దర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురంరూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.17వేలతో అమ్ముడుపోయాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 494టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బయాలజీ, ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టులకు దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేస్తామన్నారు.

జిల్లా మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. స్థానిక మల్లాలమ్మ ఆలయంలో జిల్లా మేదరసంఘం కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రంగయ్య, ఎలక్షన్ ఆఫీసర్ వీరభద్రయ్య, మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, కేఎం వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌ల సమక్షంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మేదర సంఘం అధ్యక్షుడుగా పోలేపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా వెంకటరాముడు, ప్రచార కార్యదర్శిగా పోతుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఏడాదిలో పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900మార్కులపైన వచ్చిన మేదర విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. పేద మేదర విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, ఇతర విద్యాసామగ్రి పంపిణీ చేస్తామని అన్నారు. మేదరలను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

డాబా వద్ద ఘర్షణ

- పరిటాల శ్రీరామ్, గోనుగుంట్ల అనుచరులపై కేసు

చెన్నేకొత్తపల్లి/ధర్మవరం, జూన్18(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయులు బుధవారం పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు చిగిచెర్ల అరవిందరెడ్డి, పరిటాల శ్రీరామ్ అనుచరులు నాగరాజు, ఖాసీం వలి గాయపడ్డారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, హత్యాయత్నం కేసులు నమోదు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. టీడీపీ కార్యకర్తల ఫిర్యాదు మేరకు, దామాజుపల్లికి చెందిన ఖాసీం వలి, నాగరాజు డాబా వద్ద టీ తాగుతూ పరిటాల శ్రీరామ్ గురించి చర్చించుకుంటున్నారు. అదే సమయంలో ధర్మవరం మండల చిగిచెర్లకు చెందిన అరవింద రెడ్డి మరికొందరు అక్కడికి వచ్చారు. పరిటాల శ్రీరామ్ గురించి ఎందుకు చర్చించుకుంటున్నారని అరవిందరెడ్డి విమర్శించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం మొదలైంది. అరవిందరెడ్డి డాబాలో ఉన్న వంటగదిలోకి వెళ్లి కత్తి తీసుకుని టీడీపీ కార్యకర్తలపై దాడికి యత్నించాడు. దీంతో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు పరుగులు తీశారు. అరవింద రెడ్డి వెంబడించడంతో ఎదురుతిరిగారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయపడిన ముగ్గురిని వారి వర్గీయులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం అనంతపురంలోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. టీడీపీ కార్యకర్త నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు అరవిందరెడ్డిపై కేసు నమో దు చేశారు. కాగా, పరిటాల శ్రీరామ్ అనుచరుడు వెంకటేశ్ యాదవ్ పెనుకొండలో పని ఉందని నమ్మబలికి తనను కారులో చెన్నేకొత్తపల్లి సమీపంలోని డాబా వద్దకు తీసుకెళ్లాడని అరవిందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి ఎన్ఎస్ గేటు, దామాజుపల్లికి చెందిన పరిటాల శ్రీరామ్ అనుచరులు ఖాసీం, దుబ్బ, నాగరాజు, పులి తదితరులు వచ్చారని, పరిటాల శ్రీరామ్ గురించి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతావా అంటూ తనపై దాడిచేశారని పేర్కొన్నారు. దీంతో పులి, నాగరాజు, ఖాసీం, అంజి, వెంకటేశ్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అదృశ్యమైన మహిళ బంధువులకు అప్పగింత

అనంతపురం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు చేసిన మూడో పట్టణ పోలీసులు ఆమెను కనిపెట్టి బుధవారం బంధువులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన మేరకు నందమూరి నగర్‌కు చెందిన వడ్డే దాక్షాయణి(30), ప్రదీప్‌కుమార్ దంపతులు. పిల్లలతో కలిసి వారు మంగళవారం ఐదో రోడ్డులోని బంధువులు భవానీ ఇంటికెళ్లారు. ప్రదీప్ కుమార్ తండ్రి చనిపోవడంతో బట్టలు పెట్టుకోవడానికి కర్ణాటకలోని బంధువుల ఇంటికెళ్తుండగా... దాక్షాయణి తానూ వస్తానని భర్తను కోరింది. అయితే ఆయన అందుకు ససేమిరా అన్నాడు. దీంతో ఉదయం నుంచీ బాధపడుతున్న ఆమె ఇంట్లోంచి రాత్రి 10 గంటలప్పుడు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు బృందాలుగా వెతికారు. ఆరు గంటల తర్వాత మహిళను కనిపెట్టి, తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి తర్వాత బంధువులకు అప్పజెప్పారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

జంధ్యాల (వర్ధంతి)



సినీరంగంలో హాస్యబ్రహ్మగా పేరొందిన 'జంధ్యాల' వీర వెంకటదుర్గా శివసుబ్రమణ్యశాస్త్రి 1951 జనవరి 14న నరసాపురంలో జన్మించారు. ఇంటి పేరుతోనే గుర్తింపు పొందారు. తెలుగు సినీరంగంలో స్క్రీన్‌రైటర్‌గా, దర్శకుడిగా, నటుడిగా తనదైన ముద్రవేశారు. పాతికేళ్ల సినీ జీవితంలో 4 నంది అవార్డులు, ఫిల్మ్‌ఫేర్‌లు అందుకున్నారు. శంకరాభరణం, సప్తపది, సీతాకోకచిలుక, సాగరసంగమం, స్వాతికిరణం వంటి సినిమాలకు ఆయనే మాటలు రాశారు. హాస్యానికి ట్రెండ్ సృష్టించారు. 'ఆపద్బాంధవుడు'కు ఉత్తమ మాటల రచయితగా నంది అవార్డు అందుకున్నారు. బ్రహ్మానందం, నరేష్, ప్రదీప్, సుత్తి వీరభద్రరావు, సుత్తివేలు తదితర నటులను ఆయనే పరిచయం చేశారు. 2001 జూన్ 19న గుండెపోటుతో కన్నుమూశారు.

అంగ్‌సాన్ సూకీ (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత అంగ్‌సాన్ సూకీ 1945 జూన్ 19న యాంగోన్ (రంగూన్)లో జన్మించారు. బర్మాకు చెందిన రాజకీయ నేత, రచయిత్రి. మయన్మార్ కౌన్సెలర్ (ప్రధాన మంత్రి సమానహోదా)గా వ్యవహరించారు. 2016-21 మధ్య విదేశీ వ్యవహారాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీకి 2011 నుంచి 2023వరకు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. 1988 నుంచి 2011వరకు జనరల్ సెక్రటరీగా వ్యవహరించారు. పలు గౌరవ పురస్కారాలు అందుకున్నారు.

సల్మాన్ రష్దీ (పుట్టినరోజు)



సర్ అహ్మద్ సల్మాన్ రష్దీ 1947 జూన్ 19న జన్మించారు. భారతసంతతికి చెందిన బ్రిటీష్ నవలా రచయిత. ఆయన రచనలు ఐదుసార్లు బుకర్ ప్రైజ్‌కు నామినేట్ అయ్యాయి. 1981లో 'మిడ్‌నైట్స్ చిల్డ్రన్' రచన బుకర్ ప్రైజ్ దక్కించుకుంది. 1983లో ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌లో గుర్తింపు పొందారు. 2008లో టైమ్స్ ర్యాంకుల జాబితాలో గ్రేటెస్ట్ బ్రిటీష్ రైటర్స్ 50 మందిలో 13వ స్థానం దక్కించుకున్నారు. అన్ని తరాల ఆంగ్లో-ఇండియన్ రచయితలను ప్రభావితం చేశారనడంలో అతిశయోక్తి లేదు. టైమ్ 2023 ఏప్రిల్ లో ప్రచురించిన వందమంది ప్రముఖ ప్రభావితుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఆథర్స్ గిల్డ్ ఫౌండేషన్ నుంచి ఛాంపియన్ ఆఫ్ రైటర్స్ అవార్డు పొందారు.

రాహుల్ గాంధీ (పుట్టినరోజు)



రాహుల్‌గాంధీ 1970 జూన్ 19న ఢిల్లీలో జన్మించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాజీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీల కుమారుడు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా 2017 నుంచి 2019 వరకు కొనసాగారు. అంతకుముందు అమేథీ నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీ అయ్యారు. రాజీవ్‌గాంధీ ఫౌండేషన్, రాజీవ్‌గాంధీ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు. కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలలో కొనసాగారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయబరేలినుంచి లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందారు.

బెల్ట్‌షాపులు నిర్వహించరాదు..

హిందూపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో బెల్ట్‌షాపులు నిర్వహించరాదంటూ గ్రామపెద్దలు సమావేశమై తీర్మానించారు. చౌడేశ్వరి కల్యాణమండపం వద్ద బుధవారం సమావేశమైన గ్రామపెద్దలు మాట్లాడుతూ ముద్దిరెడ్డిపల్లి ఆలయం సమీపంలో బెల్ట్‌షాపులు పెట్టడంవల్ల మద్యం సేవించి గొడవలు జరుగుతున్నాయన్నారు. వీటిని తొలగించాలన్నారు. నాలుగురోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటోలో మైక్‌పెట్టుకుని బెల్ట్‌షాపు నిర్వహించరాదంటూ ముద్దిరెడ్డిపల్లిలో అనౌన్స్‌మెంట్ చేశారు. అయితే ఈ సమావేశం నిర్వహించడానికి తెలుగుదేశం పార్టీ నాయకులే ముందుండి నడిపించడంపై అధికార పార్టీలో మరోవర్గం నాయకులు గుర్రుగా ఉన్నారు. ఏదైనా ఉంటే అధికారుల వద్ద, ఎమ్మెల్యే కార్యాలయంలో చెప్పకుండా ఏకంగా సమావేశం నిర్వహించడం ఏంటని తెలుగుదేశం పార్టీలోని మరో వర్గం నాయకులు బహిరంగంగా అంటున్నారు.

జీతాలు చెల్లించండి: ఏఐటీయూసీ

హిందూపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే పైప్‌లైన్ వద్ద పనిచేస్తున్న వాటర్‌సప్లై సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ నాయకులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ గొల్లపల్లి నుంచి హిందూపురం మధ్య నాలుగు పంప్ హౌస్‌లున్నాయని ఇందులో 25మంది సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. వీరికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అంతేకాక ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా లేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే ఈనెల 24నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు మారుతిరెడ్డి, రమేష్, హరి, ఓబులేసు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వడానికి ససేమిరా..!

పావగడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హొస్సేన్‌పురం, రాప్టే గ్రామ పంచాయతీ పరిధిలోని రైతుల నుంచి విద్యుత్ సోలార్ తయారీ కోసం భూములు కొనుగోలు చేసేందుకు బుధవారం కలెక్టర్ వచ్చారు. అయితే తమ భూములు సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించిన ధరకు తాము ఇవ్వమని ససేమిరా అని అనడంతో కలెక్టర్ శుభకల్యాణి వెనుదిరిగారు. సమావేశం ప్రారంభంకాగానే రూ. 20 లక్షలకు ఇవ్వాలని కలెక్టర్ కోరగా రూ.40లక్షలు ఇస్తేనే తాము భూములు ఇస్తామని ఖరాఖండిగా రైతులు చెప్పారు. ఎమ్మెల్యే వెంకటేశ్ సైతం రైతులకు నచ్చజెప్పేయత్నంచేసినా వారు వినిపించుకోలేదు. దీంతో కలెక్టర్ అసంతృప్తితో వెనుదిరిగారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరామ్ పాల్గొన్నారు.

రెడ్డికెరె పార్కుపై తీవ్ర నిర్లక్ష్యం



పిల్లలు ఆడుకునే ప్రదేశం కంపచెట్లతో ఇలా...



వాకింగ్‌ట్రాక్‌కు ఇరువైపులా చెత్తాచెదారం

» అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినవైనం

బాగేపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కోట్లాదిరూపాయలు ఖర్చు చేసి, వాకింగ్ చేసేవారికి వీలుగా పట్టణ శివారులోని గూళూరురోడ్డులోని రెడ్డికెరె (చెరువు) పక్కన ఉద్యానవనం కొంతకాలంగా నిర్లక్ష్యానికి గురైంది. ఈ కారణంగా ఉద్యానవనం అసాంఘిక కార్యకలాపాలకు, తాగుబోతులకు అడ్డాగా మారింది. తాలూకా కేంద్రమైన పురసభ పరిధిలో వ్యాహ్యాళి చేసే వారికి, పిల్లలకు క్రీడామైదానం లేదు. పట్టణ పరిధిలోని పార్కులకు కేటాయించిన స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో తగిన ఉద్యానవనాలు లేక వాకర్లు అంతా డీవీజీ రోడ్డుపై వ్యాహ్యాళి చేస్తుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి ఎస్‌టీపీ, ఎస్ఎస్‌పీ, 18వ ఆర్థికసంఘం పథకాలు సహా వివిధ పథకాలకింద కోట్లాది రూపాయలు విడుదల అయ్యాయి. రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, ఉద్యానవనాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శౌచాలయాలు ఇతరత్రా సౌలభ్యాలు కల్పించాలని స్థానిక సంస్థల నియమావళిలో ఉన్నాయి. అయితే పురసభ పరిధిలో వ్యాహ్యాళిచేసేవారికి, విశాంత్రి కేంద్రాలు, పిల్లలకు క్రీడా మైదానాలు లేవు. పట్టణ శివారులోని గూళూరు మార్గంలో రెడ్డిచెరువు ఉంది. ఈ మార్గంలో జనసంచారం చాలా తక్కువగా ఉంటుంది. గూళూరు, మార్గానుకుంటె, తిమ్మంపల్లి, బిళ్ళూరు తదితర ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌వైపు నిత్యం లారీలు, టెంపోలు, కార్ల సంచారం అధికమైంది. ఈ మార్గంలో 4 బార్‌లు ఉన్నాయి. వీటివల్ల రెడ్డికెరె చుట్టుపక్కల తాగుబోతులు గుంపులుగా ఉంటారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. దీంతో ఉద్యానవనానికి వెళ్లేందుకు ప్రజలు వెనుకంజ వేస్తారు. ఉద్యానవనాన్ని రెండేళ్లుగా పర్యవేక్షించడం లేదు, పార్కుకు పేరు పెట్టలేదు, కనీసం నామఫలకం కూడా లేదు. ప్రధానద్వారం దెబ్బతింది. వాకింగ్ ట్రాక్‌రోడ్డుపై కంపచెట్లు వెలిశాయి. దీంతో వ్యాహ్యాళికి అనుకూలం లేదు. పిల్లలు ఆడుకునే ఉయ్యాల, తిరిగే చక్రం ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. విశ్రాంతికోసం ఉద్దేశించి సిమెంటు బెంచీలు దుస్థితికి చేరాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో రాత్రి వేళల్లో దీపాల సదుపాయం లేదు. దీంతో మందుబాబులు ఈ పార్కును అడ్డాగా చేసుకున్నారు. ఎటుచూసినా మద్యంబాటిళ్లు కనిపిస్తాయి. చెత్తా చెదారం పేరుకుపోయింది. ఇకనైనా ఉద్యానవనాన్ని బాగు చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తగిన చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

రైతు సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న రైతుసంఘం, హసిరుసేన పదాధికారులు

శిడ్లఘట్ట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కర్ణాటక రాష్ట్ర రైతుసంఘం, హసిరుసేన డిమాండ్ చేశాయి. తాలూకాలోని నడిపినాయకనహళ్ళిలో హసిరుసేన జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తరహళ్ళి ప్రతీశ్ మీడియాతో మాట్లాడుతూ చిక్కబళ్ళాపుర జిల్లా బయలుసీమలో కరువుపీడిత జిల్లాగా ఉందన్నారు. నందికొండలపై మంత్రివర్గ సమావేశం నిర్వహించతలపెట్టారన్నారు. ఈ సందర్భంగా జిల్లా సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ప్రధానంగా భూగర్భజలాలు అడుగంటాయని, కృష్ణనది నుంచి 25టీఎంసీల నీటిని చెరువులకు మళ్లించే చర్యలు చేపట్టాలన్నారు. హెచ్ఎన్ వ్యాలి, కెసివ్యాలి పథకం మూడోదశ శుద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తాలూకాలోని జంగమకోటె హోబళి 13 గ్రామాలలో 2823 ఎకరాలను కర్ణాటక పారిశ్రామిక ప్రదేశాభివృద్ధి మండలి (కేఐఏడీబీ) చేపట్టిన భూస్వాధీనం కోసం ఆదేశాలు జారీ చేసి 13 నెలలు గడిచినా ప్రక్రియ ఇంకా మందగతిన ఉందన్నారు. ప్రతి ఎకరాకు 2 కోట్ల రూపాయల పరిహారం, భూమి ఇచ్చిన ప్రతి కుటుంబానికి ఒక ఉద్యోగం కల్పించేలా తాలూకా అభివృద్ధికి సహకరించాలని కోరారు. బగర్‌హుకుం సాగు సమితి 50, 51, 53, 57 నమూనాలలో అర్జీ సమర్పించిన రైతులకు భూమలు ఇవ్వాలని కోరారు. కాగా పాడి రైతులకు ఇస్తున్న పాల ప్రోత్సాహక మొత్తం ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉందని వెంటనే విడుదల చేయాలన్నారు. తాలూకాలో హైటెక్ పట్టుగూళ్ల మార్కెట్‌కోసం స్థలాన్ని గుర్తించి 8 నెలలు గడిచిందని, ఇంతవరకు పనులు చేపట్టలేదన్నారు. వ్యవసాయపంప్‌సెట్లకు గతంలో ఉన్న అక్రమ-సక్రమ పథకాన్ని విద్యుత్‌శాఖ కొనసాగించాలని డిమాండ్ చేశారు. మామిడి విక్రయాలకు సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌లో నిషేధం ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, మామిడికి మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలన్నారు. ఇలా పలు సమస్యలను ప్రస్తావించారు. మీడియా సమావేశంలో రైతుసంఘం, హసిరుసేన తాలూకా అధ్యక్షుడు మునేగౌడ, కార్యదర్శి నవీన్‌కుమార్ యువ విభాగం అధ్యక్షుడు సుబ్రమణి, చింతామణి తాలూకా అధ్యక్షుడు కదిరేగౌడ, భీమణ్ణ, ఆంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపట్ల నిర్లక్ష్యం తగదు



జాగృతి కార్యక్రమంలో సివిల్ న్యాయవాధికారి రోహిణి

ముళబాగిలు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వృద్ధులపట్ల నిర్లక్ష్యం తగదని, ఒకవేళ వేధించినా చట్టరీత్యా నేరమని సివిల్ న్యాయాధికారి డీ రోహిణి అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో తాలూకా న్యాయసేవల సమితి, న్యాయవాదుల సంఘం, రిటైర్డు ఉద్యోగుల సంఘం సంయుక్తంగా జాగృతి కార్యక్రమం నిర్వహించారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు ప్రేమాభిమానాలతో జీవనం చేసేవారన్నారు. క్రమేపీ చిన్నకుటుంబాలుగా మారిపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తల్లిదండ్రులను అనాథాశ్రమంలోకి చేరుస్తున్న సంఖ్య పెరగడంపై విషాదం వ్యక్తం చేశారు. పిత్రార్జిత ఆస్తులు పొందిన తర్వాత తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే వారు ఏసీ కోర్టులో అర్జీ సమర్పిస్తే, వెంటనే పిల్లలకు ఇచ్చిన ఆస్తిని వాపసు వచ్చేలా చేస్తారన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడడం కనీస ధర్మమన్నారు. ఇకనైనా యువత తీరులో మార్పు రావాలన్నారు. వృద్ధులు తమ అనుభవంతో సమాజానికి తగిన మార్గదర్శకం చేస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎం శేఖర్, తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జీఎస్ఆర్ సతీశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసప్ప, కార్యదర్శి హెచ్ నాగేశ్, తాలూకా రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం నంజుండప్ప, కార్యదర్శి మునిరత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయ మండలపూజ



శివరాత్రి దేశికేంద్ర స్వామీజీకి సన్మానం

శిడ్లఘట్ట, జూన్18(ఆంధ్రజ్యోతి): మేలూరు గ్రామంలోని ఉమా మహేశ్వర స్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం జీర్ణోద్ధరణ నేపథ్యంలో మండలపూజ కార్యక్రమంలో శివరాత్రి దేశికేంద్రస్వామిజీ పాల్గొన్నారు. ఆలయంలో గణపతి, సుబ్రమణ్యస్వామి, కాలభైరవేశ్వరస్వామి, దక్షిణామూర్తి, దంపతి సమేత నవగ్రహాలు, నాగదేవతల విగ్రహాలను పునః ప్రతిష్ఠించారు. 48రోజుల మండలపూజ ముగింపు కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలపూజలో మహాసంకల్ప, గణపతిప్రార్థన, ప్రధాన దేవతలు, పరివార దేవతలకు మహారుద్రాభిషేకం, సంక్షిప్త కళశపూజ అనంతరం గణపతి హోమం, మహారుద్రహోమం, నవగ్రహ హోమం, శ్రీసూక్తం, శాంతిహోమం, ప్రాయశ్చిత్తహోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం దేశికేంద్రస్వామిజీ నేతృత్వంలో మండలాభిషేకం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ సభ్యులు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యుడు ఉమేశ్, ప్రముఖులు రామకృష్ణప్ప, మంజునాథ్, అశ్వత్థప్ప, రమేశ్, నాగరాజ్, టీకే శ్రీనివాస్, హెచ్‌టీ సుదర్శన్, ఎస్ఆర్ శ్రీనివాసమూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేబినెట్ భేటీ మార్పుపై అసంతృప్తి



మాట్లాడుతున్న ఎంపీ సుధాకర్ తదితరులు

చిక్కబళ్ళాపుర, జూన్ 18(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లాలోని నందిహిల్స్‌లో నిర్వహించతలపెట్టిన కేబినెట్ భేటీని ఒక్కసారిగా మార్పు చేయడంపై ఎంపీ డాక్టర్ కే సుధాకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ కేబినెట్ భేటీకి సంబంధించి కొన్ని రోజులుగా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. అయితే చివరిక్షణంలో మంత్రివర్గ సమావేశాన్ని విధానసౌధకు మార్పు చేశారన్నారు. కోలారు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాల ప్రజలకు అన్యాయం చేశారన్నారు. ప్రజలకు, రైతులకు మంచి జరుగుతుందని ఆశించానని అయితే ఒక్కసారిగా కేబినెట్ భేటీ మార్పు చేశారన్నారు. తమ జిల్లాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఆరోపించారు. చిక్కబళ్ళాపుర జిల్లాకు శాశ్వత నీటి పారుదల పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఖాదీ గ్రామోద్యోగ్ మహామండలి మాజీ అధ్యక్షుడు కేవీ నాగరాజ్, బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, పురపాలక సంఘం అధ్యక్షుడు గజేంద్ర, ఉపాధ్యక్షుడు నాగరాజ్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



జ్ఞాపికలతో విద్యార్థులు తదితరులు

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హెగ్గనహళ్ళి క్రాస్‌లోని అపోలో పబ్లిక్‌స్కూల్, అపోలో అక్షరధామ విద్యార్థులకు 2024-25లో ఎస్ఎస్ఎల్‌సీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. వీరిలో 625 మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించిన వరుణికకు రూ.25వేల ప్రోత్సాహక మొత్తాన్ని ఇచ్చారు. డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైన దిశా, నవీన్, హర్షిత, సుజల్‌శెట్టి, వినయ్ టి, లిఖిత్‌గౌడలను అభినందించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి మండలి ప్రత్యేక జిల్లా అధికారి సూరజ్ ఏఆర్, బెంగళూరు ఉత్తర విభాగం యశ్వంతపుర సహాయక పోలీస్ కమిషనర్ పవన్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. పాఠశాల సంస్థాపక అధ్యక్షుడు టీసీ నాగరాజ్, ప్రిన్సిపాల్ ప్రేమ, ఉపాధ్యాయులు, పాలకవర్గం ప్రశంసించారు.

మార్కెట్‌లోకి స్మార్ట్ వాటర్ హీటర్లు

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో పేరొందిన ఎలక్ట్రిక్ వస్తువుల ఉత్పత్తి సంస్థ వి-గార్డ్ మార్కెట్‌లోకి స్మార్ట్ వాటర్‌హీటర్‌లను లాంఛనంగా విడుదల చేసింది. సంస్థ ఎండీ మిథున్ చిట్టిలపిల్లి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వస్తువుల ఉత్పత్తులలో దశాబ్దాలకాలం నాణ్యతకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వి గార్డ్ అంటే ఒక నమ్మకం అనే పేరుందన్నారు. విలాసవంతమైన నివాసాలు, ఇంటీరియర్‌కు అనుగుణంగా నాణ్యమైన వస్తువులను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నామన్నారు. వాటర్‌హీటర్‌ల వాడకం అమాంతంగా పెరిగిందని, అందుకు అనుగుణమైన మోడల్స్‌ను విడుదల చేశామన్నారు. వారంటీతోపాటు అందుబాటు ధరలతో మార్కెట్‌లోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామచంద్రన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

రేపు బీజీఎస్ ఆసుపత్రి ప్రారంభానికి
కేంద్ర హోంమంత్రి రాక



ఆదిచుంచనగిరి వర్సిటీ వీసీ డాక్టర్ ఎంఏ శేఖర్ తదితరులు

బెంగళూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గురువారం నగరానికి రానున్నారు. రాత్రికి బెంగళూరుకు చేరుకునే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం నగరూరులో ఆదిచుంచనగిరి విశ్వవిద్యాలయం, బీజీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రులను హోం మంత్రి శుక్రవారం ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఆదిచుంచనగిరి మఠాధిపతి డాక్టర్ నిర్మలానందనాథస్వామిజీ, రాజ్‌కోట్ ఆర్ష విద్యామందిర జగద్గురు పరమాత్మనందస్వామిజీ, చిత్రదుర్గ మాదార గురుపీఠం మాదార చన్నయ్యస్వామిజీలు పాల్గొననున్నారు. ఈమేరకు బుధవారం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎంఏ శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కుమారస్వామి, సోమణ్ణ పాల్గొంటారన్నారు. బీజీఎస్ మెడికల్ కళాశాల వివి క్యాంపస్‌లో ఎంబీబీఎస్, బీఎస్సీ నర్సింగ్‌తోపాటు పలు కోర్సులు ఉన్నాయన్నారు. 630 పడకలనుంచి 930 పడకలకు విస్తరింప చేశామన్నారు. డిజిటల్ ఆరోగ్య రంగంలోనూ ముందున్నామన్నారు. ఉచితంగా రోగులకు సలహాలను నిపుణులైన వైద్యులు అందిస్తున్నారన్నారు.

కార్ టీ-సెల్ థెరపీ ద్వారా క్యాన్సర్ నియంత్రణ



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ శరత్ దామోదర్, కోలుకున్న మహిళ

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌లో ఓ విధమైన రిల్యాప్స్‌డ్ పాలిక్యులర్ లింఫోమా అనే సమస్యతో బాధపడుతున్న ముగ్గురికి కార్ టి-సెల్ థెరపీ ద్వారా నారాయణ ఆసుపత్రిలో చికిత్సలు జరిపినట్లు ప్రకటించారు. నారాయణ హెల్త్‌సిటీ సీనియర్ కన్సల్టెంట్ అంకాలజీ ముఖ్యులు శరత్ దామోదర్ బుధవారం మీడియాతో మాట్లాడారు. క్యాన్సర్ ప్రమాదకరమైన జబ్బు అని, కైమరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టి-సెల్ (కార్ టి) థెరపీ అత్యాధునికమైన ఇమ్యునోథెరపీ అన్నారు. ప్రతిరోధకమైన లింఫోమా సమస్య కల్గినవారికి చికిత్సలు అందించామన్నారు. 43ఏళ్ల బెంగళూరు వాసికి అన్ని విధాలా చికిత్సలు విఫలమైన తర్వాత 2022 నవంబరులో ఈ థెరపీ ప్రారంభించామన్నారు. కొవిడ్‌తో పాటు హజ్‌యాత్రకు వెళ్లినప్పుడు స్వైన్‌ఫ్లూ వంటి సమస్యలు ఎదుర్కొన్నా ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నారన్నారు. 66ఏళ్ల మహిళ ఇదే తరహాలో ఇబ్బంది పడేవారని, 2022లో ఆమెకు లింఫోమా రిల్యాప్స్ కాగా 2023లో కార్ టి-సెల్ థెరపీ అందించామన్నారు. అప్పటినుంచి ఆమె ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. ఆమె వైద్యం పొందిన తీరు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని మీడియాకు వివరించారు.


21న ప్యాలెస్ గ్రౌండ్స్‌లో యోగా.. సంగీతం

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని సమర్థనం ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 21న ప్యాలెస్ గ్రౌండ్స్ త్రిపురవాసినిలో యోగా, సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. యోగా, సంగీతం, నృత్య కార్యక్రమాలను ఒకే వేదికపై పరిచయం చేస్తున్నట్టు ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. సమర్థనం సిస్టర్స్ అనుష మంజునాథ్, వసుంధరలు సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. 20కుపైగా దేశాలనుంచి 200మంది కళాకారులు వంద సంగీత వాయిద్యాలతో ప్రదర్శనలు ఇస్తున్నారు. కార్యక్రమానికి కేంద్ర ఆయుష్‌శాఖ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్, కేంద్రమంత్రి శోభా కరంద్లాజె, నటి నమ్రతాగౌడలు పాల్గొననున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దినేశ్‌గుండూరావు, ఎంపీ యదువీర్, లాల్ బహద్దూర్‌శాస్త్రి మనుమడు ఆదర్శ శాస్త్రి, గ్రామీ పురస్కార విజేత రికీకేజ్ తోపాటు సహజయోగా లైఫ్ ఎటర్నల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొనున్నారు. సమర్థనం ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ మహంతేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి.

బెంగళూరు మెట్రోలో అమూల్ స్టాళ్లు..!

- అనుమతులపై మండిపడుతున్న కన్నడిగులు
- టెండర్ల ద్వారానే అవకాశం: డీసీఎం డీకే

బెంగళూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో రైల్వే స్టేషన్‌లలో గుజరాత్‌కు చెందిన అమూల్ పాల ఉత్పత్తులు విక్రయించేందుకు అనుమతిలివ్వడంపై కన్నడిగులు మండి పడుతున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో అమూల్ విక్రయాలను ప్రోత్సహించేలా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రస్తావించడం తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనిని కాంగ్రెస్ నేతలు ఎన్నికల్లో ప్రచారాస్త్రంగాను ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం రెండు మెట్రో స్టేషన్‌లలో అమూల్ స్టాళ్లు తెరిచేందుకు అవకాశం ఇచ్చారు. ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ 10 మెట్రో స్టేషన్‌ల్లో పాల ఉత్పత్తులకు అనుమతులు ఇచ్చామని, 8 చోట్ల నందిని, 2 చోట్ల అమూల్ స్టాళ్లు ఏర్పాటవుతాయన్నారు. గ్లోబల్ టెండర్లలో వారికి అవకాశం దక్కిందన్నారు. స్టాళ్లు మూయించడం సరికాదన్నారు. గ్రేటర్ బెంగళూరు అథారిటీలో ఎన్ని పాలికెలు ఏర్పాటు చేయాలనేది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో చర్చించామని, ప్రతిపక్ష నాయకులతో చర్చించాక తుదినిర్ణయం తీసుకుంటామన్నారు. స్వచ్ఛబెంగళూరు కార్యక్రమానికి హెల్ప్‌లైన్ తెరుస్తామన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1606.09	1,582.81
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	15,941	801
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	160	1,752
నీటి నిల్వ (టీఎంసీలు)	30.49	5.98

మెటర్నిటీ వార్డు తనిఖీ



ఆస్పత్రిలో హక్కుల పరిరక్షణ సభ్యుడు శశిధర్ కోసాంబే

బళ్లారి సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు శశిధర్ కోసాంబే ,డాక్టర్ తిప్పేస్వామి నేతృత్వంలోని బృందం బుధవారం నగరంలోని బళ్లారి మెడికల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లోని ఎన్ఆర్‌సీ యూనిట్,స్పెషల్ నియోనాటల్ కేర్ యూనిట్, మెటర్నిటీ వార్డును సందర్శించి తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు నెలల్లో జిల్లాలో వందకు పైగా నవజాత శిశువులు మరణించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. నవజాత శిశువుల మరణానికి ఖచ్చితమైన కారణం తెలియాలని, పరిష్కారం కనుగొనాలని కోసాంబే అన్నారు. బాలల పోషకాహార లోపం పునరావాస విభాగాన్ని సందర్శించిన ఈ బృందం నమోదైన పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించారు. బాల చైతన్య యోజన కింద 23మంది పిల్లలు నమోదు చేయబడ్డారు. జిల్లాలోని పోషకాహార లోపం ఉన్న పిల్లలను నమోదు చేయడానికి ఆర్‌బీతెస్‌కే, మహిళా శిశుఅభివృద్ధి శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. గత సంవత్సరం 48,569 మంది నవజాత శిశువులు పిల్లల విభాగంలో చేరారు. అందులో 293 మంది నవజాత శిశువులు వివిధ కారణాల వల్ల మరణించారు. ఈ సంవత్సరం జనవరి నుంచి ఏప్రిల్ వరకు 1.110 మంది నవజాత శిశువులు చేరగా 103మంది నవజాత శిశువులు మరణించారు. పిల్లల మరణాలకుగల ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవాలని వైద్యులను ఆదేశించారు. బీఎంసీఆర్‌సీలోని ప్రత్యేక నియోనాటల్ కేర్ యూనిట్, ప్రసూతి వార్డులో కొరత ఉన్నప్పటికీ వాటిలో ఏసీ ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆయన వైద్యులను ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రసూతి వార్డులోని టాయిలెట్లు, బాత్రూమ్‌లను ఆయన పరిశీలించారు. ప్రతినెలా ఇక్కడ 700కిపైగా ప్రసవాలు జరగుతున్నాయి. తల్లుల స్నానికి వేడి నీటిని అందించాలన్నారు. తరువాత సిరువార గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పరిశీలించారు. అల్లీపురం సమీపంలోని మైనారిటీసంక్షేమ శాఖకు చెందిన మొరార్జీ రెసిడెన్షియల్ కళాశాల, హాస్టల్‌ను సందర్శించి పరిశీలించారు. డీహెచ్‌ఓ రమేశ్‌బాబు, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి దివాకర్, శంకిన దాసర, మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి విరోబా హొనకాండె, జిల్లా బాలల రక్షణ యూనిట్ అధికారి జెరె నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించండి

● హాస్టల్ విద్యార్థులపై చిన్నచూపు తగదు ● బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ నాగన్నగౌడ

బళ్లారి సిటీ/రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను పాఠశాలకు రప్పించడానికి ప్రోత్సహించాలని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కర్ణాటక బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ నాగన్నగౌడ అన్నారు. బుధవారం నగరంలోని కోటే ప్రాంతం బాలికల హాస్టల్, విద్యానగర్‌లోని నందా రెసిడెన్షియల్ స్కూల్, ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాల, తాళూరు రోడ్డులోని బాల భారతీయ కేంద్రీయ విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి తగిన మార్గదర్శకత్వం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలు మంచి జీవితాన్ని గడపాలంటే హాస్టళ్ళు అవసరమని వారికి స్నేహపూర్వక వాతావరణం కల్పించాలన్నారు. వారి భవిష్యత్తుకు పునాదులు వేయాలన్నారు. కోటే ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ శాఖ యొక్క ప్రీ-మెట్రిక్ బాలికల వసతి గృహంలో 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారని, నిర్వహణ కూడా సమానంగా సముచితంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్‌లో సిబ్బంది కొరత ఉన్నందున అవసరమైన సిబ్బంది నియామకం కోసం జిల్లాకలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి

అనంతరం విద్యానగర్‌లోని నందా రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించిన కమిషనర్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసే సర్క్యులర్ల ప్రకారమే ప్రైవేట్ పాఠశాలలు నడుచుకోవాలన్నారు. పాఠశాల ఫీజులకు సంబంధించి పారదర్శకతను కొనసాగించాలని, ఫీజులపై సర్క్యులర్లు జారీ చేయాలన్నారు. వీటి కాపీలను డీడీపీఐ,ప్రాంత విద్యా అధికారులకు అందజేయాలన్నారు. ఫీజు వసూలు



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్ నాగన్నగౌడ

గురించి తల్లిదండ్రులతో చర్చించాలని, పిల్లల దృష్టికి తీసుకెళ్ళి ఎటువంటి కారణం లేకుండా వారిని వేధించడం నేరమన్నారు. పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098,112ఉండాలన్నారు. సీసీటీవీ ఉన్న ప్రాంతంలో ఫిర్యాదు పెట్టెను ఏర్పాటు చేసి, తద్వారా ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. ఈవిషయంలో సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా సమన్వయం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వెంకటేశ్, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ డైరెక్టర్ మమత,రెసిడెన్షియల్ వార్డెన్ ఉషాకుమారి, జిల్లా బాలల రక్షణ యూనిట్ బాలల రక్షణ అధికారి జెరనాగప్ప, బీఈఓ సిద్దలింగ మూర్తి, సీఆర్‌పీ సిద్దప్ప, నందారెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల రక్షణ అధికారుల కర్తవ్యం..

పిల్లలు దేశ ఆస్తి అని, వారికి భద్రత కల్పించడం అధికారుల ప్రధాన కర్తవ్యమని కర్ణాటక రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ నాగన్న గౌడ అన్నారు. జస్టిస్ యాక్ట్ 2015 అమలుపై జిల్లా, తాలూకా స్థాయిలలోని వివిధ శాఖల అధికారులు, బాలల సంరక్షణ సంస్థల అధిపతులతో బాలల సబంధిత కార్యక్రమాలు, పాజెక్టులపై బుధవారం సాయంత్రం జిల్లాపంచాయతీ హాల్లో జరిగిన పురోగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పిల్లల హక్కులను పరిరక్షించడానికి వారిని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాల న్నారు. జిల్లాలో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025వరకు మొత్తం 123బాల్య వివాహ కేసులను నిరోదించగలిగారు. వాటిలో 11బాల్య వివాహ కేసులు, 11కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయబడ్డాయని దీని ప్రకారం ఏప్రిల్ నుంచి మే 2025 వరకు మొత్తం 45బాల్యవివాహ కేసులను నిరోదించగలిగారు. అన్ని పోలీస్ స్టేషన్‌లో చైల్డ్ లైన్ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. హాస్టళ్లలో మహిళా వార్డెన్‌లను నియమించాలన్నారు.



జిల్లా సమీక్షలో మాట్లాడుతున్న నాగన్నగౌడ

బాలికల హాస్టళ్లలో మహిళా వార్డెన్‌లను నియమించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందాన్ని ఉపయోగించి పోషకార లోపం ఉన్న పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించాలన్నారు. ఈసందర్భంగా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మిమైదూరు. జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి మహమ్మద్ హారిస్, అదనపు జిల్లాపోలీసు సూపరింటెండ్ రవికుమార్,మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారి రామకృష్ణ నాయక్, జిల్లా బాలలసంరక్షణ అధికారి జీరే నాగప్ప .వివిధ జిల్లా స్థాయిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మొహర్రం శాంతియుతంగా జరుపుకోండి: సీఐ

కంప్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ విశ్వనాథ్ హీరేగౌడ్ సూచించారు. కుడితిని పట్టణంలో బుధవారం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన శాంతిసభలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పీర్ల దేవుళ్ల పండుగ ప్రారంభం నుండి చివరి వరకు ఎలాంటి ఘటనలు జరగకుండా ఆ సమాజ ప్రముఖులు బాధ్యత వహించాలన్నారు. పీర్ల దేవుళ్లను కూర్చోబెట్టిన మసీదుల్లో మైకులు గాని, సౌండ్ బాక్స్‌లు గానీ అధిక శబ్దాలతో ఏర్పాటు చేయరాదన్నారు. అలా చేపట్టిన వారిపై చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో మద్యపానం సేవించి ఘర్షణకు దిగిన వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శాంతమూర్తి స్థాయి సమితి అధ్యక్షుడు రాజశేఖర్, సత్యప్ప, బీసన్న, వెంకటరమణ బాబు, స్టోర్ పంపాపతి, నాగరాజు, రామలింగ, గంగాధర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ విశ్వనాథ్ హీరేగౌడ్

రేషన్ బియ్యం స్వాధీనం

రాయచూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్నభాగ్య పథకంకు చెందిన రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలతుండగా బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని గద్వాల రోడ్డులోని ఎన్‌జీఓ కాలనీ జములమ్మ దేవి ఆలయం వద్ద ముగ్గురు తెలంగాణకు చెందిన రాజేశ్, రమేశ్, శివరాజ్ అనే వ్యక్తులు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు తెలుసుకున్న నేతాజి నగర్ పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 32 కిలోల 41 ప్లాస్టిక్ బస్తాల్లో బియ్యంతో పాటు రవాణా కోసం ఉపయోగిస్తున్న వాహనాన్ని జప్తు చేశారు. పోలీసులకు ఆహార పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ శివమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు



రంజాన్‌సాబు రచనలను పంపిణీ చేస్తున్న యశ్వంత్‌రాజ్

కన్నడ అభివృద్ధికి సహకరించాలి

● సంచార జాతులకు యశ్వంత్‌రాజ్ పిలుపు

బళ్లారి సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కన్నడనాడు ఏకీకరణకు, అభివృద్ధికి సంచారజాతుల సహకారం అపారమైనదని బళ్లారి జిల్లావాణిజ్య పరిశ్రమల సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ అన్నారు. బుధవారం నగరంలో కన్నడ సాంస్కృతిక మండలి నిర్వహించిన 'కన్నడ అభిమాన-అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి అమరవీడుడు ఫైల్వాన్ రంజాన్‌సాబ్ రచనలను విద్యార్థులకు పంపిణీ చేశారు. రచయిత సిద్ధరామ కల్మట్ మాట్లాడుతూ అనేక మంది యోధుల నాయకత్వంలో ఏకీకరణ ఉద్యమం ఏర్పడిందన్నారు.దేశ సేవకు తమ జీవితాన్ని అంకితం చేసి అమరవీరుడుగా మారిన రంజాన్‌సాబ్‌ను కన్నడిగులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. జేకే ఫౌండేషన్ అధ్యక్షుడు జోలదరాశి తిమ్మప్ప మాట్లాడుతూ యువతరం మన జాతీయ భాష గురించి మరింత తెలుసుకోవాలన్నారు. మంచి పుస్తకాలు విద్యార్థుల వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయని కార్పొరేటర్ సభ్యుడు గాదెప్ప అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశ్వరాము మాట్లాడుతూ అనేక సంచార జాతులు కన్నడ భాషాభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయన్నారు. కన్నడిగుల దృష్టిని కూడా వారి వైపు ఆకర్షించాలన్నారు. ఈసందర్భంగా రచయిత వీరేంద్ర రవిహాల్, నటుడు బసవరాజ్, మహేశ్, సుష్మ, ఆలం బాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన తిరుమల రెడ్డి

కంప్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వేణి వీరాపురం గ్రామసమీపంలోని ఎస్‌హెచ్ 63 బళ్లారి హైవే రోడ్లో సాయంత్రం రోడ్డు ప్రమాదంలో యువకుడు తిరుమలరెడ్డి (19) మృతి చెందారు. కుడితిని . పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కుడితిని వైపు నుంచి తిరుమలరెడ్డి ద్విచక్రవాహనంపై తమ గ్రామం వేణి వీరాపురం వెళుతుండగా హరిగిణదోణి క్రాస్ వద్ద లారీ డీకొంది. దీంతో బైక్ అదుపుతప్పి తిరుమల రెడ్డి రోడ్డుపై కుప్పకూలాడు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం బళ్లారి విమ్స్‌కు తరలించారు. స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శాంతమూర్తి తెలిపారు.

పెట్రోలింగ్ వాహనానికి ప్రమాదం



దెబ్బతిన్న వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కంప్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కూడ్లిగి తాలుకా సకలపూర్‌లోని హట్టి క్రాస్ సమీపంలో జాతీయరహదారి 50పై మంత్రి శివరాజ్ తంగడిగి భద్రతకు కేటాయించిన అదనపు వాహనం హైవే పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఏఎస్ఐకు తీవ్ర గాయాలయ్యాయి. మంత్రి శివరాజ్ తంగడిగి బెంగళూరు వైపు వెళ్తుండగా సకలపూర్‌హట్టి గొల్లరహట్టి క్రాస్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న మంత్రి భద్రత అదనపు వాహనం ముందు వెళ్తున్న హైవే పెట్రోలింగ్ వాహనాన్ని అదుపుతప్పి ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రాణనష్టం లేకపోవడంతో మంత్రి ఊపిరి పీల్చుకున్నారు. హైవే పెట్రోలింగ్ వాహనం మాత్రం వెనుకభాగం దెబ్బ తినింది.

చురుగ్గా మాళవి క్రస్టుగేట్ల మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కంప్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హగరి బొమ్మనళ్లి సమీపాన వుండే మాలావి జలాశయం క్రస్టుగేట్ల మరమ్మత్తు పనులు జోరుగా సాగుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే భీమానాయక రిజర్వ్ చేసిన గ్రాంట్ ఎట్టకేలకు ఫలించింది. ఆయకట్టు రైతుల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తున్నాయి. సీఎం సిద్దరామయ్య ఈ క్రస్టుగేట్ల పనులకు రూ. 165 కోట్ల గ్రాంట్ మంజూరు చేశారు. హూవిన హడగలిలోని రాజ్‌వాలా నుంచి పైపులైన్ ద్వారా రిజర్వాయర్‌ను నింపడానికి నిధులు కూడా మంజూరైనట్లు అధికారులు తెలిపారు. వర్షాలు కూడా లెక్కచేయ కుండా పగలు రాత్రి తేడా లేకుండా పనులు జోరుగా సాగుతున్నాయి. గేట్ల పనులపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ఎయిమ్స్‌ను తప్పించే కుట్రలే..

● పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస

రాయచూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటుకు సంబంధించి నిపుణుల కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పడం అభ్యంతరకరమని ఎయిమ్స్ పోరాట సమితి కన్వీనర్ బసవరాజ్ కళస అన్నారు. మంత్రి మాటలు వింటుంటే జిల్లాకు ఎయిమ్స్ రాకుండా అడ్డుకునే కుట్ర దాగి ఉన్నట్లు అర్థమవుతుందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. అదే సమయంలో మంత్రి వ్యాఖ్యలకు ఏమాత్రం అడ్డు చెప్పకుండా మౌనంగా కూర్చున్న సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ పదవిలో కొనసాగేందుకు అనర్హుడన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో మాట్లాడిన బసవరాజ్ కళస గతంలో జిల్లాకు మంజూరైన ఐఐటీని ధారవాడకు తరలించినప్పుడు ఏ నిపుణుల కమిటీ సూచించిందో బహిర్గత చేయాలన్నారు. అదే సమయంలో వివిధ రాష్ట్రాలకు మంజూరు చేసిన ఎయిమ్స్ కేంద్రాల ఏర్పాటు సందర్భంగా నిపుణుల కమిటీ శిఫార్సులు ఉన్నాయా అన్న విషయాన్ని సహితం కేంద్రం బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన కేంద్రానికి లేఖలు రావడం వరకే పరిమితం కాకుండా మంత్రి వర్గంలో రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. డిల్లీకి అఖిల పక్ష బృందం తీసుకెళ్లినప్పుడు ఎయిమ్స్ ఏర్పాటుకు సహనుకూలత వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట మార్చడం విచారకరమన్నారు. ఎయిమ్స్ ఏర్పాటు కోసం తాము సాగిస్తున్న పోరాటం నిరవధికంగా కొనసాగుతుందని ఈ విషయంలో నాయకులు పార్టీలకతీతంగా స్పందించాలన్నారు. ఈ విషయంలో జిల్లాకు చెందిన మంత్రి భోసరాజు, ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ జిల్లాకు చెందిన అన్ని పార్టీల శాసన సభ్యులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు.

హోసూరు జోన్

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

హోసూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బోనాబెండ ప్రాంతంలో రైల్వే పట్టాలపై ఒక వ్యక్తి మృతదేహం లభించింది. కరపల్లి గ్రామానికి చెందిన జనార్ధన్‌గా, ఇతను ప్రైవేట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడని గుర్తించారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని, చికిత్సలు పొందుతున్నాడని, ప్రస్తుతం డిప్రెషన్‌తో ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని హోసూరు రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సిటీ సర్వీసులు నడపాలని డిమాండ్

హోసూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణీకులు బస్సులకోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొనడంతో, సర్వీస్‌రోడ్డుపై టౌన్ బస్సులు నడపడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బెంగళూరు - చెన్నై జాతీయ రహదారిపై వాహనాలు వేగంగా కదులుతుండడంతో హోసూరు, ముత్తుమారియమ్మన్ ఆలయం, మూకొండపల్లి, సిప్‌కాట్, పేరండపల్లి, కుముదేపల్లి, గాంధీనగర్ ప్రాంతాలలో ప్రమాదకర పరిస్థితుల్లో బస్సులకోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యంగా రెండు సిప్‌కాట్ ప్రాంతాలలో వేలాదిమంది ప్రయాణీకులు జాతీయరహదారి వెంబడి ఉన్నారు. సౌకర్యార్థం టౌన్ బస్సులను సర్వీస్‌రోడ్లపై నడపాలని ప్రజలు కోరుతున్నారు. జూజువాడి, ఎంఎంనగర్ ఎదురుగా ఉన్న కాలుష్యనియంత్రణ బోర్డు, సీతారామయ్య మేడు ప్రాంతాలలో స్కైవాక్ నిర్మించారు. ప్రమాదాల నివారణకు సర్వీసురోడ్డుపై టౌన్‌బస్సులను నడపాలని కోరుతున్నారు.

ముల్లంగి ధరల పెరుగుదలపై రైతుల హర్షం



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న ముల్లంగి

హోసూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో పండించిన ముల్లంగికి మూడు నెలల తర్వాత లభించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు రూ.3-4 వరకు ఉండగా ప్రస్తుతం కిలో రూ.25 నుంచి 30 పలుకుతోంది. కృష్ణగిరి జిల్లాలో హోసూరు, బాగలూరు, శూలగిరి, రాయకోట్టై, డెంకణీకోట, తళి వంటి ప్రాంతాల్లో సుమారు 400 ఎకరాల్లో ముల్లంగిని సాగు చేశారు. 40రోజుల్లో పంట వస్తుందని భావించి రైతులు పోటీపడి సాగు చేస్తుండడంతో దిగుబడి పెరిగింది. అప్పట్లో కిలోకు రూ.3-4 మాత్రమే పలకడంతో, పంటకోతకు కూలీ ధర కూడా లభించడంలేదని పలువురు వాపోయారు. సుమారు మూడు నెలల తర్వాత ముల్లంగికి మంచి ధర పలికిందని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

యోగాపై విద్యార్థులకు అవగాహన

బళ్లారి సిటీ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా ముందస్తు కార్యక్రమం బుధవారం కురుగోడు తాలూకాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కోళూరు విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగా జాతా కార్యక్రమాన్ని వైద్యాధికారి డాక్టర్ కల్యాణి నేతృత్వంలో యోగా శిక్షకులు ప్రకాశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమ జాథాలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయుష్మాన్ మందిర సిబ్బంది శైలజా, శేఖమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణను రద్దు చేయాలి: రైతు సంఘం

విజయనగరం (హోస్పేట), జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేఐఏడీబీ భూసేకరణను రద్దు చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం విలేకరుల సమావేశంలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ బలవంతపు, అన్యాయమైన కేఐఏడీబీ భూసేకరణకు తుది నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ ఈనెల 25న దేవనహళ్లి చలో చేపడ్తామన్నారు. దీనిపై హోస్పేట తాలుకా అధ్యక్షుడు గంటా సోమశేఖర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, సిద్దరామయ్య నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బహిరంగంగా ఒక ముఖాన్ని చూపించి, సంబంధిత శాఖ అధికారులకు మరో విధంగా ఆదేశాలిస్తూ రైతులను అవమానిస్తోందన్నారు. గత నాలుగేళ్లలో అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు, సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు డాక్టర్ అశోక్ ధావలే, అఖిల భారత కిసాన్ సభ అఖిల భారత ఆర్థిక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, భారతీయ కిసాన్ యూనియన్‌కు చెందిన రాకేష్ టికాయత్



మాట్లాడుతున్న హసురుసేన సంఘం సభ్యులు

చెన్నరాయపట్నం, హంబ్లీరైతుల నిరసన స్థలాన్ని సందర్శించి ఈ పోరాటానికి తమ మద్దతును తెలిపారు. కార్పొరేట్ భూసేకరణకు వ్యతిరేకంగా చెన్నరాయపట్నం రైతుల పోరాటం విజయం సాధించడం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూసేకరణ వ్యతిరేక పోరాట ప్రయోజనాల దృష్ట్యా చాలా ముఖ్యమైనది.

ప్రభుత్వ పాఠశాలల్లో అతిథి ఉపాధ్యాయులే గతి

● రెగ్యులర్ టీచర్లులేక కుంటుపడుతున్న చదువులు



విద్యాశాఖ కార్యాలయం

సిరుగుప్ప, జూన్18(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది ప్రభుత్వ ప్రాథమిక, హైస్కూలు పాఠశాలలకు అతిథి ఉపాధ్యాయులే ప్రధాన పాత్ర వహిస్తున్నారు. సిరుగుప్ప తాలుకా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. 189 పాఠశాలలు ఉన్నప్పటికీ అందులో 1067 ఉపాధ్యాయుల పోస్టులు ఉన్నప్పటికీ 436 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. 641 పోస్టులు ఖాళీగా వున్నాయి. ప్రభుత్వం ఈ యేడాది 448 అతిథి ఉపాధ్యాయులను నియామకం చేసింది. ఇంకా 64 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి వుంది. ఉపాధ్యాయుల కొరత వలన పదవ తరగతి పరీక్షలు గతేడాది జిల్లాలో మొదటి స్థానంలో వుండేది. ఈ యేడాది 3వ స్థానంలోకి పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వంకు సంబంధిత విద్యాశాఖాధికారి గురప్ప ఎన్నో వినతిపత్రాలు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. ఇలాగే కొనసాగితే విద్యార్థుల భవిష్యత్తుపై దెబ్బపడే అవకాశం వున్నట్లు ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.



గుర్రప్ప, విద్యాశాఖాధికారి

విద్యుత్ కోతలపై కరవే ఆందోళన

రాయచూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇష్టారీతిగా విద్యుత్ కోతలకు విధిస్తు ప్రజలతో చెలగాటమాడుతున్న విద్యుత్ శాఖ అధికారుల పై కఠిణ చర్యలు తీసుకోవాలని కర్ణాటక రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు ఖలీల్ పాషా డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలకు నిరశిస్తు కరవే ఆధ్వర్యంలో బుధవారం డీసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఖలీల్ పాషా, పగటి వేట మూడు-నాల్గు గంటల పాటు కోత విధిస్తున్నారని రాత్రివేళల్లోను గంట అరగంట రెండు గంటల వరకు కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు ఆరోపించారు. ముఖ్యంగా మురికివాడల్లో రాత్రివేళల్లో కరెంటు లేకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాగా సమస్య గురించి అడిగేందుకు ఫోన్ చేసినా ఏ ఒక్క అధికారి ఫోన్లు ఎత్తకపోగా ఎత్తిన వారు సహితం అసంబద్ధమైన సమాధానాలు ఇస్తున్నారని ఆరోపించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న జెస్కాం అధికారుల పై కఠిణ చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు.



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కరవే నాయకులు